భారత్ సమాచార్. నెట్
BHARATH SAMACHAR DIGITAL



# జెమినీ ఏఐతో లేఖలు.. మావోయిస్టుల పేరుతో హైడ్రామా




**భారత్ సమాచార్, మెదక్ జిల్లా**: మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు ఏర్పాటు చేసి సోషల్ మీడియాలో ప్రచారం పొందేందుకు ప్రయత్నించిన ఇద్దరిని మెదక్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎర్ర వస్త్రాలు, బెదిరింపు లేఖలు ఉంచిన ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నాగులపల్లి గ్రామానికి చెందిన బండ మధు (23), చింతకింది శ్రీధర్ (23)లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక బైక్, రెండు మొబైల్ ఫోన్లు, నల్లరంగు రెయిన్‌కోట్, శాలువా, పెన్నులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

## అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌లో బెదిరింపు లేఖ

ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. 21/22-09-2026 అర్ధరాత్రి సుమారు 1:30 గంటల సమయంలో మాస్క్ ధరించిన ఓ వ్యక్తి తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశించాడు. తన వెంట తీసుకొచ్చిన లేఖతో కూడిన ఎర్ర వస్త్రాన్ని రిసెప్షన్ టేబుల్‌పై ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అదే సమయంలో మరో వ్యక్తి బయట బైక్‌పై వేచి ఉన్నాడు. ఇదే సమయంలో తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద కూడా మావోయిస్టుల పేరుతో ఇలాంటి లేఖను ఏర్పాటు చేశారు.




ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు వెలుగుచూడటంతో ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

## సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు

అంతకుముందు 16-09-2026న సీఎం రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన సందర్భంగా కూడా మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ వెలుగుచూడటంతో ఎస్పీ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.



ప్రత్యేక బృందం సీసీ కెమెరాల ఫుటేజ్‌తో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషించింది. ఘటన జరిగిన సమయంలో అనుమానితుల కదలికలను పరిశీలించి, వారి ఆచూకీని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగించింది. ఈ క్రమంలో నిందితుల వివరాలను పోలీసులు గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు.

## సోషల్ మీడియాలో ప్రచారం కోసమే..

దర్యాప్తులో ప్రధాన నిందితుడైన బండ మధు సోషల్ మీడియాలో ప్రచారం పొందడంతో పాటు ఫాలోవర్లు, వ్యూస్ పెంచుకోవాలనే ఉద్దేశంతో మావోయిస్టుల పేరుతో లేఖలు ఏర్పాటు చేసినట్లు తేలిందని ఎస్పీ వెల్లడించారు. మేడారం ఘటన ద్వారా ఆశించిన స్థాయిలో ప్రచారం రాకపోవడంతో తూప్రాన్‌లో మరోసారి ఇలాంటి చర్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

లేఖను రూపొందించేందుకు జెమినీ ఏఐ సహాయం తీసుకున్నారని, అనంతరం అందులో మార్పులు చేసి మొత్తం మూడు లేఖలను సిద్ధం చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఆ లేఖలపై 'అలెగ్జాండర్ అన్న', 'గణపతి అన్న' పేర్లతో పాటు కొడవలి, సుత్తి గుర్తులను ఉంచినట్లు వివరించారు.



## మున్సిపల్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు..

21/22-09-2026 అర్ధరాత్రి మధు, శ్రీధర్ ఇద్దరూ బైక్‌పై తూప్రాన్‌కు వచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ముందుగా తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద లేఖతో కూడిన ఎర్ర వస్త్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మధు మాస్క్, రెయిన్‌కోట్ ధరించి పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లాడు. పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్ టేబుల్‌పై లేఖను ఉంచిన అనంతరం తన మొబైల్ ఫోన్‌లో వీడియోను చిత్రీకరించాడు. ఆ తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయి ఫొటోలు, వీడియోలను తన సన్నిహితులకు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైందని ఎస్పీ తెలిపారు.



## నాగులపల్లి బ్రిడ్జి వద్ద అరెస్ట్

నిందితుల ఆచూకీపై పోలీసులకు అందిన సమాచారంతో 24-09-2026 సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో నాగులపల్లి బ్రిడ్జి వద్ద బండ మధు, చింతకింది శ్రీధర్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి బైక్, రెండు మొబైల్ ఫోన్లు, నల్లరంగు రెయిన్‌కోట్, శాలువా, పెన్నులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## ప్రత్యేక బృందానికి ఎస్పీ అభినందనలు

అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ ఐపీఎస్ పర్యవేక్షణలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ నేతృత్వంలో ఎస్ఐ గంగరాజు, ప్రత్యేక బృందం, ఐటీ కోర్ సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజ్, సాంకేతిక ఆధారాలను సమన్వయం చేసుకుని కేసును తక్కువ సమయంలో ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

© 2026 Bharath Samachar